పిండి రాలే.. జావ అందలే!


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు, ఇన్‌సెట్‌లో ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన రాగి ప్యాకెట్

- విద్యార్థులకు పంపిణీకాని రాగిజావ
- దశాబ్ది ఉత్సవాల్లో అట్టహాసంగా ప్రారంభం
- అనంతరం సరఫరాపై ఊసెత్తని వైనం

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన రాగిజావ పంపిణీకి ప్రారంభంలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. గత నెలలో నిర్వహించిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విద్యాదినోత్సవం రోజున రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. జులై 1వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామని ప్రకటించారు. 18 రోజులు దాటినా నేటికీ విద్యార్థులకు రాగిజావ అందడం లేదు. ఇప్పటివరకు పాఠశాలలకు రాగి, బెల్లం పిండి ప్యాకెట్లు రాలేదు. దీంతో విద్యార్థులు రాగిజావ కోసం ఎదురుచూస్తున్నారు.

దౌల్తాబాద్ మండలంలో..

మండలంలో మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 5వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. వారానికి 3 రోజులు ఉడకపెట్టిన కోడిగుడ్డును అందిస్తుంది. అయితే విద్యార్థులకు మరింత పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు గాను ఉదయం వేళలో రాగిజావ అందించాలని నిర్ణయించింది.

వారానికి మూడు రోజులు..

జూలై 1వ తేదీ నుంచి రాగిజావ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. రాగిపిండి మాత్రం పాఠశాలలకు చేరలేదు. మధ్యాహ్న భోజన కార్మికులతోనే రాగిజావ అందించాలని నిర్ణయించారు. రాగి పిండిని మాత్రం శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరఫరా చేస్తామని ప్రకటించారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిజావలో మరో 10 గ్రాముల బెల్లంపొడి కలిపి ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం పెడుతున్నా వారానికి మూడు రోజులు మాత్రమే కోడిగుడ్డు ఇస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డును అందిస్తున్నందున మిగిలిన మూడు రోజులైన మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే 1వ తేదీలోపే అన్ని పాఠశాలలకు రాగిపిండి అందాల్సి ఉన్నా సరఫరాలో జాప్యం కారణంగా జావ పంపిణీ ప్రారంభం కాలేదు.

పిండి రాగానే జావ అందిస్తాం



మండలంలో అన్ని పాఠశాలలకు రాగిపిండి సరఫరా కావాల్సి ఉంది. రాగిజావ సరఫరాపై ఇప్పటివరకైతే ఎలాంటి సమాచారం లేదు. మండల కేంద్రానికి పిండి వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలకు పంపుతాం. ఆ తర్వాత వెంటనే రాగిజావ అందిస్తాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

కాకరవేణి చెక్‌డ్యామ్‌కు జలకళ


చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న అక్బర్‌బాబా, నాయకులు

యాలాల: మండల పరిధిలోని గోవిందరావుపేట సమీపంలోని కాకరవేణి నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో పూర్తయ్యిందని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా అన్నారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి చెక్‌డ్యామ్ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. రెండేళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మాణ పనులు వేగంగా జరిగాయన్నారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి వరదనీటితో కళకళలాడుతుందన్నారు. చెక్‌డ్యాం నిర్మాణంతో ఆయకట్టు రైతులతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

సర్పంచ్ పాండునాయక్

ధారూరు: ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు లేకుండా రైతు వేదికలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటని రాంపూర్‌తండా సర్పంచ్ పాండునాయక్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు మద్దతుగా ఉంటారని చాలామంది రైతులను సమావేశానికి పిలువలేదని ఆరోపించారు. రైతు వేదికలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలుగా మారాయని ఎద్దేవా చేశారు. ధారూరు రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశానికి కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు లేకుండా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి రైతువేదికలో సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

క్లుప్తంగా

నేడు బషీరాబాద్‌కు జెడ్పీ చైర్‌పర్సన్

బషీరాబాద్: బషీరాబాద్ మండలానికి గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి రానున్నారని ఎంపీపీ కరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.15 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సునీతారెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ఆమె హాజరవుతారని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గిరిజాపూర్‌లో విద్యుత్ సరఫరాకు ఆటంకం

సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల నిరసన

యాలాల: మండల పరిధిలోని దౌలాపూర్ అనుబంధ గిరిజాపూర్ గ్రామంలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు బుధవారం దౌలాపూర్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో మూడు రోజులుగా వివిధ కారణాలతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం జరుగుతుందన్నారు. దీంతో రాత్రివేళల్లో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో తాండూరు–కొడంగల్ రోడ్డుపై ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

సేవలతోనే గుర్తింపు: ఎస్పీ


శంకరయ్యను సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహించి రిటైర్ అయిన శంకరయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్‌ఐ అచ్యుతరావు, హోంగార్డు ప్రెసిడెంట్ సుధాకర్, దేవాకుమార్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’కు తరలిరండి: ఏబీవీపీ

తాండూరు టౌన్: ద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న హైదరాబాద్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం తాండూరు పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో బహిరంగ సభకు సంబంధించి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం విద్యారంగంలో సమస్యలను పరిష్కరించడంతో విఫలమైందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదలలో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మానేష్ చారి, నగర విస్తారక్ శివశంకరాచారి, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్‌గౌడ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గోకఫసల్‌వాద్‌లో పంటల నమోదు

దౌల్తాబాద్: సాగులో వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కొడంగల్ వ్యవసాయశాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. బుధవారం మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో 20 సర్వే నంబర్లలో పంటల నమోదు కార్యక్రమం చేపట్టారు. అలాగే ఈనెల 30వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓలు శ్రీపతి రెడ్డి,, వైష్ణవి, నిఖిల్ ఉన్నారు.

స్వామిజీ సమాధికి రుద్రాభిషేకం


అభిషేకం చేస్తున్న శంకర్ స్వామీజీ

బషీరాబాద్: బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ అంబాభవానీ మాత ఆలయ వ్యవస్థాపక స్వామిజీ శ్రీలింగైక్య మాణిక్యప్ప 19వ పుణ్యతిథి సందర్భంగా బుధవారం ఆయన సమాధికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ పీఠాధిపతి శ్రీ శంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీ మహాసమాధికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సహస్ర బిల్వార్చన, వివిధ రకాల పూలచే పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వామీజీ భక్తులు, భవానీమాత భక్తులు పాల్గొని అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నాదానం చేశారు.

ఓటర్ జాబితాను పూర్తిచేయండి

బీఎల్‌ఓలతో తహసీల్దార్ సమీక్ష

దోమ: ప్రతి బీఎల్‌ఓ ఓటరు జాబితాను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ షాహెదాబేగం అన్నారు. బుధవారం దోమ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయరాం, ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, బీఎల్‌ఓలతో తహసీల్దార్ ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో ధృవీకరించుకొని పూర్తి చేసేందుకు శ్రద్ధ వహించాలన్నారు. అర్హులైన ఓటర్లను ఓటరు జాబితాలో చేర్చి.. మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఓటర్లుగా నమోదై ఉంటే వాటిని వెంటనే తొలంగించాలని సూచించారు. ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, నర్సింహులు, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ లింగం, అయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.


దోమ: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ షాహెదాబేగం

చౌదర్‌పల్లిలో..

బొంరాస్‌పేట: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటరు యంత్రం, ఓటుహక్కు ప్రాముఖ్యత గురించి బుధవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శేరినారాయణ రెడ్డి, సర్పంచు వెంకటమ్మ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

దౌల్తాబాద్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరింది. మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు సాయిలు మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి..

బొంరాస్‌పేట: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 14వరోజుకు చేరింది. బుధవారం సమ్మెలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికుల్లో అర్హులకు దళితబంధు, బీసీ బంధు పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, జీపీ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు నర్సింహులు, సుభాష్ తదితరులున్నారు.

గుంజీలు తీస్తూ నిరసన..

పూడూరు: పూడూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు గుంజీలు తీస్తూ నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం 19500 పెంచడంతో పాటు అర్హులందరినీ పర్మినెంట్ చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు ముజాహిద్, బందయ్య, ఖాజా, వెంకటయ్య, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


తాండూరు రూరల్: ఎద్దుకు వినతిపత్రం ఇచ్చి కార్మికుల వినూత్న నిరసన

ఎద్దుకు వినతిపత్రం అందజేత..

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన బుధవారానికి 14వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు ఎద్దుకు వినతిపత్రం సమర్పించి వినూత్న నిరసన చేపట్టారు.

అల్బెండజోల్ మాత్రలు వేయాలి


కుల్కచర్ల: సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి చంద్రప్రకాశ్

ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందితో అధికారుల సమీక్ష

కుల్కచర్ల: ఒక సంవత్సరం నుండి 19సంవత్సరాల లోపు ఉన్న యువతీయువకులు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు (నులిపురుగుల నివారణ మాత్రలు) వేసుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం కుల్కచర్ల మండల పరిషత్‌లోని 44 గ్రామపంచాయతీల్లో సూమారు 14,080 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. వైద్య సిబ్బంది మనీశ్ రెడ్డి, యాదమ్మ, విజయలక్ష్మి, శివాని, వెంకటయ్య, రత్న, వెంకటమ్మ, జ్యోతి, భారతమ్మ, శ్రీలత, జంగమ్మ, మైభమ్మ, గౌరీ, సుజాత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాత్రల పంపిణీ

దౌల్తాబాద్: మండలంలో గురువారం నులిపురుగుల నివారణ(అల్బెండజోల్) మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి రతన్‌లాల్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. 1నుంచి 19 ఏళ్లలోపు ఉన్న ప్రతి విద్యార్థికి మాత్రలను వేయనున్నారు.

విజయవంతం చేయాలి..

మోమిన్‌పేట: జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మండల వైద్యాధికారి బేజిలీల్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1వ సంవత్సరం నుంచి 19వ సంవత్సరం లోపు వయస్సున్న బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పరిగి: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఎంఆర్ ఆయన అనుచరులతో బుధవారం బాధితుడికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వెంకట్‌రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.5వేలు..

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. చౌడాపూర్ మండలం లింగన్నపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త శ్రీను భార్య అంజమ్మ బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయాన్ని స్థానిక నేతల చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, నాయకులు నారాయణ, రమేష్, అంజు, శ్రీనివాస్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పోస్టుమార్టం గది నిర్మాణ పనుల పరిశీలన

కొడంగల్: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం గదిని బుధవారం మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, బొంరాస్‌పేట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్, పట్టణ మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పరిశీలించారు. పనులు చివరి దశకు వచ్చినట్లు తెలిపారు. త్వరలో వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆదేశించారన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌ఐ రాజీరెడ్డి

పెద్దేముల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దేముల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రాజీరెడ్డి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రానికి రెడ్ అలర్ట్ ప్రకటించడంతో మండల రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం మండలంలోని పెద్దేముల్, పెద్దేముల్‌తండాతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించి అందులో నివాసం ఉంటున్న వారికి జాగ్రత్తలు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. పెద్దేముల్‌తండాలో వర్షానికి కూలిన ముడావత్ సంతు ఇల్లును ఆర్‌ఐ రాజీరెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా కృషిచేస్తానన్నారు.

ప్రభుత్వ బడులకు చేయూతనివ్వండి

మండల విద్యాధికారి హరిశ్చందర్

పూడూరు: స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. బుధవారం పూడూరు మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ ప్రభుత్వ పాఠశాలలో పలువురు దాతలు విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. పెద్ద ఉమ్మెంతాల్‌లో కమర్షియల్ ట్యాక్స్ అధికారి వెంకటయ్య ప్రొజెక్టర్‌ను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌టూహెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రవినాయక్, దాతలు మంజువాణి, కమర్షియల్ ట్యాక్స్ అధికారి వెంకటయ్య, సర్పంచ్‌లు శ్రీధర్‌గుప్త, అఫ్జల్, శ్యాంకుమార్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి అంజిలయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్–2 అధ్యక్షుడు భరత్‌కుమార్ అన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి యువజన కాంగ్రెస్ నేతలు పరిగిలో తలపెట్టిన బస్సుయాత్రకు బుధవారం కాంగ్రెస్ నేతలు భారీగా తరలివెళ్లారు. కుల్కచర్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు తరలివెళ్లారు.


బస్సుయాత్రకు వెళ్తున్న నేతలు

వర్షాలతో పంటలకు జీవం

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వాడిపోయే దశలో ఉన్న ఆరుతడి పంటలకు జీవం పోసినట్లయ్యింది. ఈ సారి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. ఆ పంటల ఎదుగుదలకు కూడా వర్షం కురవక ఆందోళన చెందుతున్న సమయంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ఊరటనిచ్చింది.

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండలంలో రెండు రోజులుగా ముసురు వర్షం కురుస్తోంది గురువారం కురిసిన వర్షానికి.. మండలంలో విత్తిన పంటలకు జీవం పోసినట్లయ్యింది. ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

తాండూరు మండలంలో..

తాండూరు రూరల్: మండలంలో రెండు రోజులుగా ఎడతేరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తోంది. బుధవారం కురిసిన వర్షానికి పత్తి, కంది, మినుము, పెసర, సోయాబీన్ పంటలకు జీవం పోసినట్లయ్యింది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తాండూర్ రూరల్: కళకళలాడుతున్న పెసర పంట

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


కొనసాగుతున్న తాండూరు – మహబూబ్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు

కొడంగల్: మహబూబ్‌నగర్–చించోలీ జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కొడంగల్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే దారిలో నియోజకవర్గ పరిధిలో చెట్లను తొలగించారు. ఒక సైడు మట్టి పోస్తున్నారు. జేసీబీల సాయంతో పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తయియతే కొడంగల్, తాండూరు, కోస్గి, మహబూబ్‌నగర్ ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తాండూరు మీదుగా కర్నాటక రాష్ట్రం చించోలీ వరకు జాతీయ రహదారిని నిర్మిస్తారు. ఈ జాతీయ రహదారికి 167–ఎన్ గా పేరు పెట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు 7 మీటర్ల వెడల్పులో ఉంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 10 మీటర్లకు పెంచుతారు. పట్టణాలు గ్రామాలు కలిసే చోట నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తారు. బెంగుళూరు ముంబాయి జాతీయ రహదారులను కలిపే ఈ రహదారి సుమారు 150 కిలోమీటర్లు పొడవు ఉంటుంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్లు, కర్నాటక రాష్ట్రంలో 50 కిలోమీటర్లు, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 55 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించిఉంది. జాతీయ రహదారి నిర్మాణం వల్ల వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని గ్రామాలకు మెరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. డీపీఆర్‌లో సూచించిన అలైన్‌మెంట్ ప్రకారం కొడంగల్, తాండూరు పట్టణాల్లో బైపాస్‌లు నిర్మిస్తున్నారు. త్వరలో పనులు పూర్తిచేయడానికి కృషి చేస్తున్నట్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు


గోపన్‌పల్లి రోడ్డుపై గోతులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోపన్‌పల్లికి వెళ్లేదారి అధ్వాన్నంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డంతా గుంతలమయమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్ వరకు రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే సదరు కాంట్రాక్టర్ బల్కెటూర్ నుంచి కరన్‌కోట్ వరకు రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేసి.. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు కేవలం కంకరవేసి వదిలేశాడు. దీంతో రోడ్డంతా గుంతలమయమై అధ్వాన్నంగా మారింది. అధికారులు స్పందించి గోపన్‌పల్లి వరకు రోడ్డు పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.